18వ వసంతంలోకి

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ - కృష్ణా

మంగళవారం 18 మార్చి 2025 పేజీలు 8




రంజాన్ వేళలు

ఇఫ్తార్

సా. 6:23 (మంగళవారం)

సెహరీ

ఉ. 4:56 (బుధవారం)

ఈనాం భూముల సమస్యలను

# పరిష్కరించాలి

ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్



**నందిగామ, మార్చి 17, మేజర్ న్యూస్ :** ఈనాం భూములపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని 'నిషిద్ధ జాబితా'లో నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ

2

ప్రజాప్రతినిధుల క్రీడలకు..

# సర్వం సిద్ధం



- శాప్ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు
- క్రీడా కోర్టులను పరిశీలించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- రేపు 3 గంటలకు ప్రారంభంకానున్న క్రీడలు
- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

**విజయవాడ బ్యూరో, మార్చి 17, మేజర్ న్యూస్ :** ప్రజాప్రతినిధులకు ఉపశమనం కలిగించేదిశగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు శాప్ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసినట్లు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడలకు సంబంధించి విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం నుంచి క్రీడలు జరగనున్నాయన్నారు. ఆ ఏర్పాట్లను ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బొజ్జల సుధీర్ రెడ్డి, సుందరపు విజయ్ కుమార్, పీవీజీఆర్ నాయుడు(గణబాబు), ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పంచుమర్తి అనురాధతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, థగ్ ఆఫ్ వార్, తదితర కోర్టులను పరిశీలించి ట్రయల్ గేమ్స్ నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, క్రీడా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. దానిలో భాగంగానే కమిటీ సభ్యులంతా గత పదిరోజులుగా ఏర్పాట్లను మిగతా 2లో...

అత్యుత్తమ పారిశుధ్య నిర్వహణలో..

# పెనుగంచిప్రోలుకి ప్రథమ స్థానం





- సర్పంచ్ వేల్పుల పద్మకుమారికి, కార్యదర్శి గొర్రెపాటి శ్యాం కుమార్‌కు గ్రామ ప్రజల అభినందనలు
- పంచాయతీరాజ్ కమిషనరేట్ నిర్వహించిన ఐవిఆర్ఎస్ సర్వేలో వెల్లడి

**పెనుగంచిప్రోలు, మార్చి 17, మేజర్ న్యూస్ :** అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రం, మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు గ్రామపంచాయతీ ఎన్టీఆర్ జిల్లాలో అత్యుత్తమ శానిటేషన్ నిర్వహిస్తున్న ఉత్తమ గ్రామ పంచాయితీగా ఎన్నికయింది.రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరేట్ ద్వారా ఐ వి ఆర్ ఎస్ సర్వే ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో పెనుగంచిప్రోలు గ్రామంలో నిర్వహిస్తున్న శానిటేషన్ పద్ధతిని ప్రజలు ముక్తకంఠంతో మెచ్చుకున్నారు. నూటికి ఎనభై ఐదు శాతం ప్రజలు ఈ శానిటేషన్ చేస్తున్న విధానాన్ని ప్రశంసించారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా పెనుగంచిప్రోలు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి తను ఎన్నికైన నాటి నుంచి పెనుగంచిప్రోలు పరిశుభ్రంగా ఉంచే దానికోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. గ్రామంలో రోడ్ల వెంట చెత్త

మిగతా 2లో



ఏపీలో ప్రశాంతంగా

# పది పరీక్షలు

- తొలి రోజు పరీక్షకు 98.27 శాతం మంది హాజరు

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 17, మేజర్ న్యూస్ :** ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయని పాఠశాల విద్య సంచాలకులు విజయ్ రామరాజు.వి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6,27,277 మంది విద్యార్థులకు గానూ 6,16,451 మంది విద్యార్థులు హాజరు కాగా, 10,826 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. 3,450 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 1545 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశారని తెలిపారు. 2

(మొదటిపేజీ తరువాయి)

### ఈనాం భూముల సమస్యలను పరిష్కరించాలి

డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అభ్యర్థించారు. సోమవారం శాసనమండలిలో మాట్లాడుతూ గతంలో జమీందారులు దేవాలయాలకు, దేవాలయాలకు సేవలందించే వారికి జీవనోపాధి కోసం పూర్వం సాగుభూములను ఇనాం (విరాళం)గా ఇచ్చేవారు. జమీందారీ వ్యవస్థ రద్దు అయ్యాక 1956 లో నాటి ప్రభుత్వం ఇనాం చట్టాన్ని తీసుకొచ్చి.. రైత్వారీ పట్టాలను అందజేసింది. 1956 నుండి 2013 వరకు ఇనాం భూములపై క్రయవిక్రయాలు – లావాదేవీలు జరిగేవి. 2013 ఉమ్మడి ఏపీలో నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం "ఈనాం ల్యాండ్ అబాలిషన్" యాక్ట్ ను తీసుకొచ్చి.. ఇనాం భూములను "22 ఏ– సీ" చేర్చి నిషిద్ధ జాబితాలో చేర్చారు. అప్పటికే 7 – 8 సార్లు రిజిస్ట్రేషన్‌లు జరిగినప్పటికీ నిషిద్ధ జాబితాలో చేర్చినందున క్రయవిక్రయాలకు వీల్లేకుండా పోవడంతో భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సొంత అవసరాలకు భూమిని అమ్ముకోలేక.. ఇంట్లో వివాహాలకు – ఆసుపత్రుల ఖర్చులకు – ఇతర అవసరాలకు కనీసం తాకట్టు పెట్టుకుందామన్న వీల్లేకుండా పోవడంతో న్యాయబద్ధంగా కొనుక్కున్న భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019లో తెదేపా ప్రభుత్వం ఇనాం భూములపై ఆర్డినెన్స్ తీసుకొచ్చినప్పటికీ, ఈ చట్ట సవరణ అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఇనాం భూములను నిషిద్ధ జాబితాలో నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

### అత్యుత్తమ పారిశుధ్య నిర్వహణలో
## పెనుగంచిప్రోలుకి ప్రథమ స్థానం



కుప్పలు,పెంట దెబ్బలు, లేకుండా తగు చర్యలు చేపట్టారు. గ్రామంలో పెద్ద సంఖ్యలో మొక్కల పెంపకాన్ని కూడా చేపట్టారు. నాటి రాకెమ్ కంపెనీ(నేటి.కోహెన్స్) వారి సహకారంతో ట్రీ గార్డులను అందించారు. వేలాది మొక్కలను తమ సొంత ఖర్చుతో పెనుగంచిప్రోలు గ్రామంలో నాటించి ట్యాంకర్ల ద్వారా నిత్యం నీరు పెడుతూ మొక్కలను పెంచారు. ప్రజలను చైతన్యవంతం చేస్తూ, తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా సేకరిస్తూ, ఉదయం ఆరు గంటలకే ఆరు వాహనాలలో చెత్త సేకరణ చేస్తూ మైకు ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలోనే చెత్త నుండి సంపద తయారు చేయు కేంద్రాన్ని ( డంపింగ్ యార్డ్) సుందర నందనవనంగా మార్చడం జరిగింది. డంపింగ్ యార్డ్ వద్ద ఒక గొప్ప ఆహ్లాదకరమైనటువంటి వాతావరణం పచ్చని మొక్కలతో, కూరగాయలతో ఆకుకూరలతో,పూల మొక్కల తో ఒక ఉద్యానవనాన్ని తలపించే విధంగా తీర్చిదిద్దారు. నాటి జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు నేటి జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా సైతం ఈ చెత్త నుండి సంపద తీసే కేంద్రాన్ని, ఇక్కడ చెత్త నుండి వర్మి కంపోస్ట్ తయారు చేసే విధానాన్ని, చెత్తను సేకరించి "నాడాప్" పిట్స్ లో నింపే విధానాన్ని అభినందించారు. జిల్లాకే ఈ యొక్క సంపద కేంద్రం ఆదర్శనీయమని అధికారులను, సర్పంచిని కలెక్టర్ అభినందించడం జరిగింది. ఇటీవల కాలంలో చెరువుకు భారీగా వరదలు వచ్చి, ఈ చెత్త సంపద కేంద్రం తీవ్రమైన నష్టానికి గురైన కూడా, సర్పంచ్ పద్మ కుమారి చొరవ తో యుద్ధ ప్రాతిపదిక మీద దాని పునర్నిర్మాణం జరిగింది. గత నెలలో జగ్గయ్యపేట నియోజకవర్గం లోని అన్ని మండలాలకు చెందిన కార్యదర్శులు,శానిటరీ సిబ్బంది ని ఈ చెత్త సంపద కేంద్రం కు పిలిపించి ట్రైనింగ్ క్లాస్ కూడా నిర్వహించడం జరిగింది.

ఈ చెత్త సంపద కేంద్రంలో, పెనుగంచిప్రోలు గ్రామంలో అత్యంత విలువైన మొక్కలను సర్పంచ్ తన సొంత నిధులతో పెంచడం ఒక విశేషం. పెనుగంచిప్రోలు గ్రామంలో రోడ్లకు ఇరువైపులా,పచ్చని మొక్కలు చక్కగా పెరుగుతూ, చల్లని వాతావరణానికి తాము సైతం సహకరిస్తామంటూ అన్నట్లుగా కనిపిస్తుంటుంది. మండల అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారి, మండల ఈ ఓ పి ఆర్ డి, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది,శానిటరీ సిబ్బంది, గ్రామ ప్రజలు అందరి సహకారంతోనే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచగలుగుతున్నామని సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి తెలిపారు. ప్రజలందరూ చెత్త రహిత గ్రామంగా, పెనుగంచిప్రోలు ను ఉన్నత స్థానంలో నిలబెట్టే దానికోసం క్లీన్ పెనుగంచిప్రోలు. గ్రీన్ పెనుగంచిప్రోలు అనే నినాదంతో ప్రజలు అందిస్తున్న కృషికి సర్పంచి పద్మ కుమారి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగ రహిత గ్రామంగా కూడా పెనుగంచిప్రోలును తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఆమె పిలుపు ఇచ్చారు. రాజకీయాలకతీతంగా అందరి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. అభివృద్ధి విషయంలో రాజకీయ జోక్యం ఉండకూడదని అదే తన అభిప్రాయం అని చెప్పారు. గ్రామ అభివృద్ధికి ఎవరు సహకరించినా నిండు మనసుతో ఆహ్వానిస్తామని ఆమె అన్నారు. ఈ విజయం పెనుగంచిప్రోలు గ్రామ ప్రజలదే అని ఆమె అన్నారు. పెనుగంచిప్రోలు గ్రామంలో తమ రాజకీయాలకతీతంగా నిర్వహిస్తున్నటువంటి సేవలు, కృషి మన రాష్ట్రానికే ఆదర్శం కావాలని సర్పంచ్ పద్మ కుమారి అభిలాషించారు.

# ప్రజాప్రతినిధుల క్రీడలకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాల్లో 13 క్రీడలను నిర్వహించనున్నామని, మంగళవారం మధ్యాహ్నం క్రీడా శాఖా మంత్రి, స్పీకర్ కలిసి క్రీడలను సాయంత్రి ప్రారంభిస్తారన్నారు. 20వ తేదీన క్రీడలు ముగిసిన తర్వాత గెలుపొందిన బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ ప్రజాప్ర తినిధులను సైతం క్రీడల్లో భాగస్వాములను చేస్తుందన్నారు. తద్వారా వారి నియోజకవర్గాల్లోనూ క్రీడలను అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా శాసనసభ్యుల క్రీడలతో ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధికి నోచుకోవడం సంతోషకరమన్నారు.

**క్రీడల నిర్వహణపై సమీక్ష..**

మూడురోజులపాటు జరిగే ప్రజాప్రతినిధుల క్రీడలను ఆయా స్టేడియాల్లో ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించనున్నట్లు క్రీడల కమిటీ సభ్యులైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివరించారు. క్రీడల నిర్వహణకు సంబంధించి శాప్ కోచ్‌లు, డీఎస్డీఓలతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఒక్కో డీఎస్డీఓకు ఒక్కో క్రీడను కేటాయించారు. వారికి కేటాయించిన క్రీడలకు సంబంధించి జట్టులను, మ్యాచులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. తొలుత థగ్ ఆఫ్ వార్, క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, టెన్నిస్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, రన్నింగ్, టెన్నికాయిట్ క్రీడలను నిర్వహిస్తామని వెల్లడించారు. క్రీడల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని



మెరుగైన వసతులు సమకూర్చాలని విశాఖ ఈస్ట్ ఎమ్మెల్యే గణబాబు సూచించారు. అలాగే స్టేడియానికి వచ్చే ప్రజాప్రతినిధులు, న్యాయ నిర్ణేతలు, శాప్, మున్సిపల్ అధికారులు ఇబ్బందిపడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు ప్రతిచోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అనురాధ తెలియజేశారు. క్రీడా సామగ్రి పంపిణీ, రిసెప్షన్, శానిటేషన్ విభాగాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గణబాబు, సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌లు సూచించారు. ప్రతీ విభాగానికి ఒక్కో ఇంఛార్జ్ ఉండాలని, దానికారణంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, డీఎస్డీఓలు, శాప్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ప్రశాంతంగా పది పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలో ఇద్దరు విద్యార్థులు కాపియింగ్ కు పాల్పడ్డారని, ఆ ఇద్దరిని డిబార్ చేసినట్లు పాఠశాల విద్య సంచాలకులు విజయ్ రామరాజు.వి తెలిపారు.

**పది పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ గవర్నర్‌పేట సీవీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా పదో తరగతి పరీక్షల నిర్వహణకు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి నేపథ్యంలో తాగునీటికి, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా తీసుకున్న చర్యలతో పాటు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రం గదుల్లో ఏర్పాటుచేసిన ఏర్పాట్లను కూడా పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు తదితరుల వివరాలను అడిగి తెలుసుకొని.. చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్షా విధులకు కేటాయించిన ప్రతిఒక్కరినీ క్షుణ్నంగా తనిఖీచేసి మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులకు గదుల్లో గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవాలని.. ఏమాత్రం ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 168 పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. భద్రతతో పాటు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీచేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎన్‌టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు**

**తొలిరోజు ప్రశాంతం**



తొలిరోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రిజిస్టర్ అయిన 27,711 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 27,443 మంది హాజరయ్యారు. అదేవిధంగా 44 మంది ప్రైవేటు విద్యార్థులకు 39 మంది హాజరైనట్లు డీఈవో యూవీ సుబ్బారావు తెలిపారు. తాను 11 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా అధికారులు, సిబ్బందికి సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

**గుడ్లవల్లేరు 4 కేంద్రాల్లో 505 మంది హాజరు**



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** 2025 మార్చి పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైనవి. గుడ్లవల్లేరు మండలంలోని 4 పరీక్షా కేంద్రాల్లో(కౌతరం జడ్పీ, దోకిపర్రు ప్రభుత్వ, అంగలూరు జడ్పీ, గుడ్లవల్లేరు ఎస్ఇఆర్ఎమ్ ఉన్నత పాఠశాలలు) 502 మంది రెగ్యులర్ విద్యార్థులకుగాను 501 మంది, 5 మంది సప్లిమెంటరీ విద్యార్థులకుగాను 4 గురు వెరసి మొత్తం 507 మందికి 505 మంది హాజరైనట్లు గుడ్లవల్లేరు మండల విద్యాశాఖాధికారులు జి. గోపాల రావు, జి. జగన్మోహనరావు లు తెలిపారు. విద్యార్థులను ఉదయం 8 గంటలనుండే హాల్ టిక్కెట్లు పరీక్షించి పరీక్షా కేంద్రాలలోకి విద్యార్థులను అనుమతించారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాలవద్ద విద్యార్థులకు మంచినీటి వసతిని, అత్యవసర వైద్య సహాయం కొరకు గుడ్లవల్లేరు, కౌతరం పి హెచ్ సి ల వైద్య సిబ్బంది కొన్ని ఔషధాలతో హెల్త్ డెస్క్ ఏర్పాట్లు చేసారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, పరీక్ష కేంద్రాలవద్ద సౌండ్ పొల్యూషన్ లేకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ, ఏఎస్ఐ సారధి లు, పోలీసు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షణ చేసారు.

**కోలాహలంగా ప్రారంభమైన పది పరీక్షలు**



**గుడివాడ, మేజర్ న్యూస్:** పదో తరగతి పరీక్షలు గుడివాడలో కోలాహలంగా ప్రారంభమయ్యాయి. 10పరీక్షలకు గుడివాడ పట్టణంలో 14, రూరల్ లో 1 పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. మొత్తం 15 కేంద్రాల్లో 2800 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 12.45 వరకు కొనసాగింది. విద్యార్థులను ఉదయం 8.45కే కేంద్రాల్లోకి అనుమటించారు. పది పరీక్షలతో రోడ్లన్నీ విద్యార్థులతో కళకళలాడాయి. పోలీసులు గేటువద్ద విద్యార్థులను చెక్చేసి కేంద్రంలోకి పంపారు.

**ప్రశాంతంగా ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు**



అవనిగడ్డ(మేజర్ న్యూస్) : అవనిగడ్డ మండలంలో పదోవతరగతిపరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా సోమవారం ఉదయం 8.45 ని॥లకు చేరుకున్నారు. పోలీసులు విద్యార్థుల హాల్ టిక్కెట్ నెం.లను చెక్ చేసి పరీక్షా కేంద్రాలలోకి విద్యార్థులను అనుమంతించగా విద్యార్థులు వారి హాల్ టికెట్ నెం.ద్వారా రూమ్ నెం.లను పరిశీలించి రూమ్‌లోకి తరలివెళ్ళగా విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు ఆల్‌దిబెస్ట్‌చెప్పి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు సూచనలు చేశారు. పదోతరగతి పరీక్షలు వ్రాసేందుకు పరీక్షా కేంద్రాలకు స్కూల్ పేరుకు బదులుగా కోడ్ నెం. కేటాయించారు. నాలుగు కేంద్రాలుకుగాను 559 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా మొదటిరోజు 4 గురు గైర్హాజరు కాగా 555 మంది హాజరయ్యారు. 52041 కేంద్రంలో 160మందికి గాను 160 మంది హాజరయ్యారు. 52042 కేంద్రంలో 133కుగాను 130 మంది హాజరై 3 గురు గైర్హాజరయ్యారు. 52043 కేంద్రంలో 130 కు గాను 129 మంది హాజరవంటంతో ఒకరు గైర్హాజరయ్యారు. 52044 కేంద్రంలో 136 కు గాను 136 మంది హాజరవ్వటంతో మొత్తం నాలుగు కేంద్రాలలో 4గురు గైర్హాజరయ్యారు.

# పేదవాడి సొంత ఇంటి కల నెరవేరాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్**

**పేదల ఇంటి స్థలాల అర్జీలు బాధ్యతగా నెత్తిన మోస్తాం**

**కమ్యూనిస్టుల పోరాట ఫలితమే పేదలకు ఇళ్ల స్థలాలు**





**జగ్గయ్యపేట మార్చి 17 మేజర్ న్యూస్ :** భారత కమ్యూనిస్ట్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గం, పట్టణ సమితుల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మంత్రి వర్గం సమావేశంలో తీర్మానం చేసి, జీవో విడుదల చేసిందని, దాని ప్రకారం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ అర్జీలను స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి పక్షాన ఎర్ర జెండా పోరాడుతూనే ఉంటుందని అన్నారు. ఇనాం భూముల్లో ఉన్న వారికి పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేసారు. కూటమి ప్రభుత్వం కమ్యూనిస్టుల పోరాటం వల్లనే గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగిందని తెలిపారు. మండలం తహశీల్దార్ కార్యాలయం ముందు ప్రజలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదికకి అర్హులైన ఇండ్ల స్థలాల లబ్ధిదారులతో అర్జీలను అందించడం జరిగిందని అన్నారు. సుమారు వెయ్యి మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొని అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చుండూరు సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, నియోజకవర్గ కార్యదర్శి ఆంబోజి శివాజి, పట్టణ కార్యదర్శి జూనె బోయిన శ్రీనివాస రావు తదితరులు ప్రసంగించ్చారు. ఈ కార్యక్రమంలో మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నీలకంఠం శివప్రసాద్, సీపీఐ ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, పట్టణ సహాయ కార్యదర్శులు మాశెట్టి రమేష్ బాబు, అసదుల్లా, ఎన్టీఆర్ జిల్లా ఏఐ వై ఎఫ్ అధ్యక్షులు కరిసే మధు, వత్సవాయి మండల సిపిఐ కార్యదర్శి జానీ,నాయకులు మెటికల శ్రీనివాసరావు, భోగ్యం నాగులు, ఎంగ్రపల్లి భాను,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విశ్రాంతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**నందిగామ, మార్చి 17, మేజర్ న్యూస్ :** పెన్షనర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈరోజు స్థానిక ఆర్డిఓకి నందిగామ విశ్రాంత ఉద్యోగస్తుల సంఘం తరఫున వినతి పత్రం సమర్పించారు. పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని డిఏలు విడుదల చేయాలని ఇంతకుముందు ప్రకటించిన డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్ని ఆసుపత్రులలో ఈ హెచ్ ఎస్ కార్డులపై ఉచిత వైద్యము అందజేయాలని అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ కూడా పూర్వం లాగా 10% 15% గా పునరుద్ధరించాలని, గౌరవ ముఖ్యమంత్రి ని కోరుతూ ఈ వినతి పత్రము సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ మార్కెట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ 1 ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ మార్కెట్ ను గౌరవ మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఇక్కడ దుకాణం ఏర్పాటు చేసిన యాజమాన్యానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలకు సరసమైన ధరలకు తాజా పండ్లు, కూరగాయలు విక్రయించాలని వారికి సూచించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో కుటుంబ అభివృద్ధి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్వయం ఉపాధితో మహిళలు కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలని డాక్టర్ డి.సుధారాణి పిలుపునిచ్చారు. పంచాయతీ పరిధిలోని బందలాయి చెరువు గ్రామంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో మహిళలకు చేపలు, రొయ్యల తో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పై జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ వారి సహకారం తో 5 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ కుటుంబాలలో జరిగే చిన్న చిన్న ఫంక్షన్లకు చేపలు రొయ్యలతో చేసే ఆధారిత ఉత్పత్తుల తోనే ముందుకి సాగాలన్నారు. నేడు సమాజంలో వచ్చిన మార్పులు అనుగుణంగా చిన్న హోటల్ నుండి ఫైవ్ స్టార్ హోటల్ వరకు ఈ ఉత్పత్తులనే వినియోగించి లాభాలు గడిస్తున్నారు అన్నారు శిక్షణా కార్యక్రమం లో తయారు చేసే విలువ ఆధారిత ఉత్పత్తులు నేర్చుకొని, మహిళలు స్వయం ఉపాధి పొందుతారని అభిలషించారు. మత్స్య శాస్త్రవేత్త జె. యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ చేపలు, రొయ్యలతో చేసే విలువ ఆధారిత ఉత్పత్తులు గురించి వివరించారు. మహిళలకు చేప కట్లెట్, చేపబాల్స్ తయారు చేసి చూపించారు డా. కృష్ణవేణి, గృహ విజ్ఞాన్ శాస్త్రవేత్త మాట్లాడుతూ చేపల, రొయ్యలలో ఉండే పోషకాలు, చేపలు, రొయ్యాలలో ఆహారం లో భాగంగా చేసుకోవడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్తలు డా. కృష్ణవేణి, డా. రేవతి, గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

**కోడూరు మార్చ్ 17 మేజర్ న్యూస్ :** కోడూరు మండలంలో ప్రశాంత వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష నిర్వహణకు ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల వద్దకు పరీక్ష సమయానికి ముందే పరీక్ష సమయానికి ముందుగానే విద్యార్థులు హాల్ టికెట్లతో పరీక్ష కేంద్రాల వద్దకు హాజరు కాగా కోడూరు ఎస్సై చాణిక్య ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వసంత



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలం లోని కుంటముక్కల గ్రామంలో నూతన వధూవరులను మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ఆశీర్వదించారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామ మాజీ సర్పంచి పల్లెర్లమూడి వెంకట రాజేంద్ర వరప్రసాద్ (బాలాజీ) కుమారుడు శ్రీనివాసరావు వివాహం, లక్ష్మీ చైత్ర తో శనివారం జరిగింది. వివాహాన్ని పురస్కరించుకుని సత్యనారాయణ స్వామి వారి వ్రతాన్ని కుంటముక్కల గ్రామంలోని వారి నివాసంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదగాలి





**అవనిగడ్డ, (మేజర్ న్యూస్):** విద్యార్థులు ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదగాలని అవనిగడ్డ ఎం.ఎల్.ఎ మండలిబుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. అవనిగడ్డలో ఎం బికె టవర్స్ సాహితీ నందనంలో ఎంపిసిఐఎల్ డిపార్టుమెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఎక్స్ చీఫ్ ఇంజనీర్ మెగా ఇంజనీరింగ్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ (న్యూక్లియర్) మానేపల్లి కోటయ్య, రాధిక దంపతుల ఆధ్వర్యంలో సోమవారం అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల విద్యార్థులకు గణితం, సైన్సు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యతో పురోగమించడం సాధ్యమని గుర్తించి విద్యార్థులలో నైపుణ్యం పెంచాలని ఆకాంక్షతో అక్షర ఫౌండేషన్ నిర్వాహకులు ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మానేపల్లి కోటయ్య అవనిగడ్డలోని శిశువిద్యామందిరంలో సాధారణ విద్యార్థి అయినప్పటికీ కఠోర శ్రమతో ఆంధ్రా యూనివర్శిటీలో ఇంజనీరింగ్ విద్యలో గోల్డ్‌మెడల్ అందుకునే స్థాయికి ప్రతిభను పెంచుకున్నారన్నారు. రాధికా తండ్రి దేసు వెంకట సుబ్బారావు త్రివేణి వక్కపొడి వ్యాపారం ప్రారంభించి సైకిల్‌పై విక్రయిస్తూ శ్రమించి త్రివేణి వక్కపొడిని పెద్ద వ్యాపారసంస్థగా తీర్చిదిద్దారన్నారు. అదేవిధంగా నేటి విద్యార్థులు భవిష్యత్‌లో తాము ఏరంగాన్ని ఎన్నుకున్నా ఆరంగంలో సమున్నతంగాఎదిగేందుకు కృషిచేయాలని మందలో ఒకరిగా కాకుండా వందలో ఒకరిగా ఉండాలని సూచించారు. శ్రీనివాస రామనుజన్ కంచిలోని తమ చిన్న ఇంటిలో ఉంటూ విజ్ఞానంతో గణితశాస్త్రంలో అద్భుతమైన ఆవిష్కరణలు సృష్టించి ప్రపంచ ప్రఖ్యాతి గడించారన్నారు. తెలుగు వాడైన యల్లాప్రగడ సుబ్బారావు సైన్స్‌లో విస్తృత పరిశోధనలు చేసి అనేక రుగ్మతలకు మందు కనిపెట్టారన్నారు. నాటి ప్లేగు, బోధకాలు, కేన్సర్‌తో పాటు నేటి కరోనా వరుకు అనేక మందులు కనిపెట్టేందుకు ఆయన అందించిన ఆవిష్కరణలు మూలంగా నిలిచాయన్నారు. మంటా డలోని జన్మించిన సామాన్యవ్యక్తి నోరి దత్తాత్రేయులు కేన్సర్ వైద్యునిగా ప్రపంచ ప్రఖ్యాతి పొందారన్నారు.

అణిచివేతను ఎదుర్కొని ఉన్నత విద్యావంతుని గా ఎదిగిన భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తింపు సాధించారని చెప్పారు. పేదరికం నుంచి ప్రపంచస్థాయికి ఎదిగిన ఎంతోమంది ఇటువంటి మహోన్నత వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని నేటి విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. గత కొన్నేళ్ళ నుంచి ఈ తరహా టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తున్న అక్షర పౌండేషన్ నిర్వాహకులను మండలి అభినందించారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల ఎం.ఈ.ఓలు ఎమ్.శివశంకర రావు, టి.రామదాసులు తదితర ఉపాధ్యాయులు పాల్గొని మండలి బుద్ధ ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు.

## లంక లితీష్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరంలో లంక లితీష్ ఆధ్వర్యంలో సోమవారం చలి వేంద్రాలు ఏర్పాటుచేశారు. రెడ్డిగూడెం మండలం, మైలవరం మండలం తెలుగు దేశం పార్టీ కార్యలయం ఇంచార్జి డి ఇ నాగ మల్లేశ్వరావు మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాలనుసారంగా పాదచారులకు వేసవి దాహార్తి తీర్చుటకు తెలుగు యువత అధ్యక్షుడు లంక లితిష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 11 అర్జీలు

**నందిగామ, మార్చి 17, మేజర్ న్యూస్ :** పట్టణంలోని రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార భాగంగా రెవిన్యూ డివిజనల్ అధికారి కే బాలకృష్ణ ప్రజల నుంచి అర్జీలు తీసుకొనియున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 11 అర్జీలు వచ్చినవి అని తెలియజేశారు. రెవిన్యూ డిపార్ట్మెంట్ 5,సర్వే డిపార్ట్మెంట్ -2, పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ -2, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ -1, మున్సిపాలిటీ డిపార్ట్మెంట్ -1 వచ్చాయి. సదరు అర్జీలను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

## స్వచ్ఛ కలెక్టరేట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరం వద్ద స్వచ్ఛ కలెక్టరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్ర శేఖరరావు ప్రారంభించారు.తమ సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుండి అర్జీలు పట్టుకొని మీకోసం కార్యక్రమానికి వచ్చే ప్రజలకు వేసవి తాపం నుండి కాసింత ఉపశమనం కలిగించే విధంగా స్వచ్ఛ కలెక్టరేట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం పట్ల పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెఆర్ఆర్సి ఎస్డిసి శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో అంజనేయ ప్రసాద్, డిఆర్ఓ సిసి వెంకటేశ్వరరావు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల శివశంకర భగవాన్‌కు ప్రత్యేక పూజలు



**అవనిగడ్డ (మేజర్ న్యూస్) :** బాల శివ శంకర భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక, మోదేవి మండలం కోసూరి వారిపాలెం కృష్ణానదీ పాయల నడుమ స్వయంగా వెలసిన బాల శివశంకరభగవాన్‌కు సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిశేవ విజయలక్ష్మి, ఆలయ అర్చకులు సుబ్బయ్య శాస్త్రిలు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, నవవిధ అభిషేకాలు గోత్రనామాలతో పూజలు నిర్వహించి స్వామివార్లను విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగాభక్తులు సుదీర్ఘ ప్రాంతాలనుండి తరలి వచ్చి ఆలయ ఆవరణలోగల నాగేంద్రస్వామి వారి పుట్టలో పాలుపోసి, పసుపు, కుంకుమ, పూలు పళ్ళతో పూజలు చేసి గణపయ్య, నాగేంద్రస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం బాలశివశంకరభగవాన్ స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మి స్వయంగా పరిశీలించారు.

## రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించిన చైర్మన్ కృష్ణకుమారి



**నందిగామ, మార్చి 17, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ప్రభుత్వ విప్ స్థానిక శాసన సభ్యులు తంగిరాల సౌమ్య ఆదేశాను సారం 2 వార్డులో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి పర్యటించారు ఈ కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి నోచుకోని రోడ్లను పరిశీలించారు. కూటమి ప్రభుత్వ హయాంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్లను, డ్రైనేజీల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కార నాణ్యతలో జిల్లాను అగ్రగామిగా నిలపండి





### మండల, డివిజన్ స్థాయిలోనూ గ్రీవెన్స్ డేను సమర్థవంతంగా నిర్వహించండి

### జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 133 అర్జీలు

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 17, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కార నాణ్యతలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికారులు నిబద్ధతతో కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు మొత్తం 133 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 43, పోలీస్ శాఖకు 26 అర్జీలు వచ్చాయి. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 12, పౌర సరఫరాల శాఖకు 6, డీఆర్డీఏకు 6 అర్జీలు రాగా పంచాయతీరాజ్ శాఖకు 5 అర్జీలు అందాయి. ఉపాధి కల్పన, వైద్య ఆరోగ్య శాఖలకు నాలుగు చొప్పున, ఇరిగేషన్, మార్కెటింగ్ శాఖలకు సంబంధించి మూడు చొప్పున అర్జీలు వచ్చాయి. ఏపీసీపీడీసీఎల్, విభిన్న ప్రతిభావంతులు, గృహ నిర్మాణం, ఐసీడీఎస్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు రెండు చొప్పున అర్జీలు రాగా.. వ్యవసాయం, బీసీ కార్పొరేషన్, బీసీ సంక్షేమం, సహకార సొసైటీ, దేవాదాయ, మత్స్య, అటవీ, బ్యాంకింగ్ సేవలు, ఆర్ అండ్ బీ, సాంఘిక సంక్షేమం, సర్వే శాఖలకు ఒకటి చొప్పున అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా దరఖాస్తులను క్షుణ్నంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలన్నారు. ఎప్పటికప్పుడు లాగిన్‌లో ఉన్న అర్జీలతో పాటు డ్యాష్‌బోర్డులోని స్థితిగతులను పరిశీలించాలని సూచించారు. డివిజనల్, మండలస్థాయిలోనూ గ్రీవెన్స్‌డేను సమర్థవంతంగా నిర్వహించాలని, అర్జీల పరిష్కారంపై క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని.. ఇందుకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

# ఈనెల 25, 26 తేదీలలో సీఎం, కలెక్టర్ల కాన్ఫరెన్స్



### పీపీటీలు, వివరాలను సిద్ధం చేయండి

### అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 25, 26 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నందున అందుకు సంబంధించిన పిపిటిలు, వివరాలను సిద్ధం చేసి వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ చంద్రశేఖర రావు, కే ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి లతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.తొలుత జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని, ఇందుకోసం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన నివేదికలను నిర్ణీత నమూనాలో వెంటనే అందజేయాలన్నారు. మీకోసం అర్జీల పరిష్కారంపై సమీక్షిస్తూ జిల్లాలో మొత్తం 19,378 అర్జీలు రాగా అందులో ఇప్పటివరకు ఇంకా 2,397 అర్జీలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు వాటిని సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గడువు మీరిన అర్జీలు 5 ఉన్నాయని వాటిని సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కృత్తివెన్ను ఈఓఆర్డి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ హైకోర్టు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ ఎంతో ఓపికగా అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్లో మొత్తం 145 అర్జీలు అందాయి. అందులో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి: కృత్తి వెన్ను మండలం కృష్ణాపురం, లక్ష్మీపురం పల్లెపాలెం గ్రామాలకు చెందిన రెడ్డి అప్పన్న, పోనాల గంగాభవాని, బర్రె రాంబాబు మాట్లాడుతూ తమ ప్రాంతంలో మంచినీటికి ఇబ్బందిగా ఉందని, మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటి సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తూ అర్జీలు అందజేశారు. మండల కేంద్రమైన అవనిగడ్డ గ్రామపంచాయతీ కి చెందిన కంచర్ల కోటేశ్వరరావు ఆర్సీఎం చర్చి నుండి తారు రోడ్డు వరకు మంజూరైన మురికి కాలువ నిర్మాణంలో జాప్యం జరుగుతుందని, ఫిబ్రవరి 5వ తేదీలోగా సమస్య పరిష్కరిస్తామని ఇదివరకు చేసిన ఫిర్యాదుకు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని ఇచ్చినప్పటికీ అది అమలు కాలేదని కాంట్రాక్టర్ పనిచేయడం లేదని ఫిర్యాదు చేస్తూ తమ ప్రాంత డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ విజ్ఞాపన పత్రం అందజేశారు.మచిలీపట్నం మండలం పెద్దకరగ్రహారం చెందిన పరసదుర్గ తనకు పట్టాదారు పాసు పుస్తకం లో 1.30 ఎకరాలు పొలం ఉందని, ఆర్డిఓ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం తనకు 1.06 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారని హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తన భూమి తనకే దక్కాలని సర్వే చేయించి హద్దులు చూపి తనకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. కృత్తివెన్ను మండలం చిన్న పాండ్రాక గ్రామానికి చెందిన పాము మామిళ్ళ మాట్లాడుతూ తన స్థలాన్ని తమ్ముడు ఆక్రమించుకున్నాడని 0.5 సెంట్లలో ఉన్న స్థలం సర్వే వారు వచ్చి కొలతలు వేయలేదని, తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కృష్ణ జిల్లా శాఖ అధ్యక్షులు కే. రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శి సిహెచ్ ఆశీర్వాదం మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిషన్ను ఏర్పాటు చేయాలని, పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని, డి.ఆర్., పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లించాలని, 70 సంవత్సరాలు పైబడిన వారికి పాత పద్ధతిలో అడిషనల్ క్వాంటం మొత్తము అందజేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద ప్రైవేట్ ఆస్పత్రులలో నగదు రహిత వైద్యం చేయడం లేదని డబ్బులు చెల్లించి మెడికల్ రీయంబర్స్మెంట్ చేయించుకోవాలంటున్నారని తెలుపుతూ వినతిపత్రం అందజేశారు. పెదన మండలం కూడూరు గ్రామ వాస్తవ్యులు కాగిత శ్రీహరి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తనకు బందర్ మండలం కరగ్రహారం సచివాలయం పరిధిలో రి సర్వే నెంబర్ 243-1 లో 3 సెంట్ల భూమి ఉందని తన భూ రికార్డులు పరిశీలించి భూమిని సర్వే చేయించి తగిన న్యాయం చేయవలసిందిగా కోరుతూ అర్జీ అందజేశారు.ఈ కార్యక్రమంలో డ్వామా, డి ఆర్ డి ఏ పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, రహదారులు భవనాలు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు లోకేష్, నటరాజు, వ్యవసాయ అధికారి మనోహర్, డిఎస్ఓ పార్వతి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, డి పి ఓ అరుణ, డిటిడబ్ల్యుఓ ఫణి దూర్జటి గృహ నిర్మాణ అధికారి వెంకట్రావు, ఉద్యాన అధికారి జ్యోతి, సూక్ష్మ నీటి సేద్యం అధికారి విజయలక్ష్మి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కోలాహలంగా కాలగమనం ట్రైలర్ లాంచ్



**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలో కాలగమనం చిత్రం ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామీణ నేపథ్యంలో తీసిన చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి విజయవంతం చేయాలని హీరో రాజా హీరోయిన్ లావణ్య రామారావు కోరారు. బందర్ రోడ్ లోని బాలోత్సవ్ భవన్ లో దర్శక, నిర్మాత బుర్రి సుధాకర్ నిర్మించిన కాలగమనం సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం అభిమానుల సమక్షంలో కోలాహలంగా సాగింది. తొలుత సినిమాకు సంబంధించిన ఒక పాటను ఆవిష్కరించగా ఆ పాటకు హీరో రాజా హీరోయిన్ లావణ్య జంటగా కలిసి స్టెప్పులు వేసి అందర్నీ అలరించారు. అనంతరం ట్రైలర్ ను అతిరథుల సమక్షంలో ఆవిష్కరించారు. ట్రైలర్ చాలా బాగుందని గ్రామీణ నేపథ్యంలో తీసిన ఈ సినిమా అందర్నీ ఆకట్టుకుంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హీరో రాజా హీరోయిన్ లావణ్య మాట్లాడుతూ కాలగమనం చిత్రాన్ని కుటుంబ సమేతంగా ప్రేక్షకులు వీక్షించవచ్చని తెలిపారు. ఏ విధమైన అసభ్యసన్నివేశాలు గాని, అసభ్య పదజాలం ఈ చిత్రంలో లేవని చెప్పారు. దర్శకుడు బుర్రి సుధాకర్ ఈ చిత్రంలో బడ్జెట్కు ఏమాత్రం వెనకంజ వేయకుండా నూతన నటీనటులతోనే చక్కని చిత్రాన్ని తీయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం దర్శకుడు బుర్రి సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో తీసిన బలగం చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రేక్షకులందరికీ తెలుసని అదే రీతిలో కాలగమనం చిత్రాన్ని కూడా నిర్మించడం జరిగిందన్నారు. ఈ చిత్రం నిర్మించడానికి తనకు ఎంతో మంది సహకారం అందించారని వారికి తానెప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ప్రేమ కామెడీ యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయని కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని వీక్షించవచ్చని చెప్పారు వచ్చే నెలలో కాలగమనం చిత్రాన్ని థియేటర్ లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలియజేశారు. కాగా జబర్దస్త్ టీమ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. తమదైన పంచ్ డైలాగులతో అందర్నీ అల్లరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఫిలింఛాంబర్ మాజీ అధ్యక్షులు మధు మోహన్ వేగ జువెలరీ అధినేత వనమా సుధాకర్,కాపా శ్రీనివాసరావు విచ్చేసి సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్ర నటీనటులు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# నగర బీసీ ఐక్యవేదిక నూతన కమిటిని అభినందించిన సినీనటులు సుమన్





**విజయవాడ మేజర్ న్యూస్ :** సోమవారం నగరానికి విచ్చేసిన ప్రముఖ సినీనటులు సుమన్ తల్వార్, నగర బిసి ఐక్యవేదిక నూతన కమిటీని పేరు పేరున అభినందించారు. తొలుత సుమన్ తొలితెలుగు శాసనకర్త ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి చితప్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయవాడ నగర బిసి ఐక్యవేదిక అధ్యక్షులు పి.వి.ఎల్.ఎన్. రాజు శనివారం నగర కమిటీని ప్రకటించిన సందర్భముగా సినీ నటులు సుమన్ సోమవారం కమిటీ సభ్యులను పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ బిసి కులాల వారు శ్రమజీవులని, బిసికులస్తులు లేకపోతే సగటు మనిషి జనజీవనం అతలాకుతలంగా తయారు అవుతుందని అన్నారు. విజయవాడ నగరంలో విస్తరించి యున్న బిసి కులస్తులం దరిని కలుపుకొని వారి సమస్యల పరిష్కారంకోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ అభినందన కార్యకమంలో బిసి ఐక్యవేదిక నగర అధ్యక్షులు పివిఎల్ఎన్ రాజుతో పాటు ఎన్.వి. రావు, అధ్యక్షులు, బిసి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, నగర నూతన కమిటీ కార్యవర్గం పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం సినీనటులు సుమన్ పివిఎల్ఎన్ రాజు స్వగృహానికి వెళ్లి తేనేటివిందు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ఎపిఎన్టీవోస్ జనరల్ సెక్రటరి ఎ.వి. సాగర్, డా. బిఆర్ అంబేద్కర్ యూని వర్శిటీ వెలగ జోషి, పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గుళ్లపల్లి నారాయణరావు, డా. పి.వి.ఎన్. కృష్ణ, గోళ్ళ నారాయణరావు తదితర నగర పమ్రుఖులు పాల్గొన్నారు.

విజయవాడ నగర బీసీ ఐక్యవేదిక నూతన కమిటి అధ్యక్షులుగా పి.వి.ఎల్.ఎన్ రాజు (అబ్బు), రిటైర్డ్ ఎసిటివో, (ముదిరాజ్, తెనుగోళ్లు), సహాధ్యక్షులు పీతా ఈశ్వర ప్రసాద్, మత్సకార కన్వీనర్, ఉమ్మడికృష్ణా జిల్లా, పటమట (అగ్నికులక్షత్రియ), ఉపాధ్యక్షులు దొడ్ల లక్షణరావు, న్యాయవాది (యాదవ), వీరంకి గోకర్ణేశ్వరరావు, వ్యాపారవేత్త, (గౌడ), ప్రధాన కార్యదర్శి దేరంగుల వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్, (వడియరాజులు), ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ బాజి, వ్యాపారం(దూదేకుల), శీరం వెంకటరావు, ఉపాధ్యక్షులు, నగరాల సంఘం, (నగరాలు), సహాయకార్యదర్శి కొండయిగుంట రాము (రజక), గుర్రం ఏడుకొండలు, రిటైర్డ్ వి.ఎమ్.సి., (ఉప్పర), కోశాధికారి రిమ్మనపూడి బ్రహ్మేశ్వరరావు, కాంట్రాక్టర్, (నాయీబ్రాహ్మణ) లను పేరుపేరున సుమన్ అభినందించారు.



## కార్యదర్శులకు పని భారం తగ్గించాలి

**మొవ్వ మార్చి 17 మేజర్ న్యూస్:** పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని ఎంపీడీవో జె విమాదేవికి సోమవారం పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడి కారణంగా బీపీ, షుగర్ వంటి అనేక వ్యాధులు బారినపడి ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ అప్పగిస్తున్న పనులు ఒత్తిడిలో కుటుంబ వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతున్నామనీ ఎండిఓ వద్ద వారి బాధను వెల్లబుచ్చుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు విశ్రాంతి తీసుకునే వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వినతి పత్రం అందించిన వారిలో కార్యదర్శుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే కేవీ సోమేశ్వరరావు, కే సందీప్ రెడ్డి, ఎంఎన్ఎస్ మూర్తి పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో నూతన షట్టర్ల ఏర్పాటు పనులు వేగవంతం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గంలో సమర్థవంతమైన సాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేస్తున్న కృషిలో భాగంగా పంట కాలువలకు నూతన షట్టర్ల ఏర్పాటు పనులు చేపట్టారు. అవనిగడ్డ, నాగాయలంక మండలాల పరిధిలోని పంట కాలువలకు స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నిధులు రూ.28.20లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. సౌత్ ఛానల్ పరిధిలోని 1, 3, 4, 6,7 నెంబర్ల పంట కాలువలు, సెంట్రల్ ఛానల్ పరిధిలోని 1, 1ఏ పంట కాలువలు, మందపాకల పరిధిలోని 2,3 నెంబర్ల పంట కాలువలు, బాలస్వామి చానల్, బాలస్వామి రెగ్యులేటర్లకు నూతన షట్టర్ల ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దీంతోపాటు మందపాకల డైరెక్ట్ ఛానల్ పూడికతీత పనులు చేపట్టారు. నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, ఇరిగేషన్ శాఖ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈ పొన్నూరు రవితేజ పర్యవేక్షణలో ఈ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనులను అవనిగడ్డ మండల పరిధిలోని అశ్వారావుపాలెం గ్రామం వద్ద సోమవారం నీటి సంఘం అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు ఉపాధ్యక్షులు రేపల్లె వెంకటేశ్వరరావు, అశ్వారావు పాలెం మాజీ ఉపసర్పంచ్ దాసినేని సాంబశివరావు రైతులతో కలిసి పరిశీలించారు.

## సన్ స్టార్ స్కూల్లో ఘనంగా ఇఫ్తార్ విందు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రంజాన్ మాసం సందర్భంగా సన్ స్టార్ స్కూల్లో జరిగిన ఇఫ్తార్ విందు మత సామరస్యానికి సాక్ష్యంగా ప్రతీకగా నిలిచిందని సన్ స్థార్ స్కూల్స్ అకడమిక్ మెంటర్ శ్రీరామ్ అన్నారు. సోమవారం సన్ స్టార్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, ఉపవాస దీక్షలో ఉన్న స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ సిబ్బంది ఒకే సమయానికి ఉపవాస దీక్షను విరమించి మిగిలిన వాళ్ళతో కలిసి సహపంక్తి భోజనం చేయడం ద్వారా తామంతా ఒక్కటేనని చాటిచెప్పారు.ఇఫ్తార్ కలయికను ఉద్దేశించి మాట్లాడుతూ మత సామరస్యాన్ని అన్నదమ్ములలా కలిసిమెలిసి ఉందామనే సంకల్పం ఈ ఇఫ్తార్ విందు ఇచ్చిందన్నారు. మనమంతా ఒక్కటి అని చాటి చెప్పేందుకు శక్తివంతమైన వేదిక అయ్యిందన అందరిది మానవ కులం అని శ్రీ రామ్ అన్నారు. కులమతాలకు అతీతంగా సమైక్యంగా ఇఫ్తార్ విందుకు ఉత్సాహంగా పేరెంట్స్, డైరెక్టర్ అయ్యప్ప స్వామి, స్టార్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆదిత్య,సన్ స్టార్ స్కూల్ ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు మేరకు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి తమ సమస్యల పరిష్కారం కోరుతూ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కారుమూరి రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేబ్రోలు ఆశీర్వాదం, కార్యదర్శి బి కే దుర్గారావు వినతి పత్రం అందించారు.

## అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు హర్షనీయం



**కంచికచర్ల మార్చి 17 మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం 58 రోజులపాటు కఠోర దీక్ష చేపట్టి ఆత్మ బలిదానం చేసిన పొట్టి శ్రీరాములు 58 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయటానికి ముఖ్య మంత్రి నిర్ణయం హర్షణీయమని కంచికచర్ల ఆర్యవైశ్యులు పేర్కొన్నారు. సోమవారం వాసవి యువసేన అధ్యక్షులు జూలూరి విశ్వనాథం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరలా వచ్చే జయంతి నాటికి పొట్టి శ్రీరాములు విగ్రహం నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని, అమరావతి లోనే మెమోరియల్ కూడా ఏర్పాటు చేస్తానన్నారని తెలిపారు. అదేవిధంగా పొట్టి శ్రీరాములు స్వగ్రామమైన పడమటిపల్లి లోని నివాసాన్ని మ్యూజియంగా రూపుదిద్దుతామని, గ్రామంలో ఆధునిక వసతులతో ఆరోగ్య కేంద్రం, హైస్కూల్ భవన నిర్మిస్తామని, గ్రామస్తుల కోరిక మేరకు బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చినందుకు చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ లకు కూటమి ప్రభుత్వానికి కంచికచర్ల వాసవి యువసేన తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జాతి కోసం పొట్టి శ్రీరాములు బతికారని తెలుగువారి చరిత్ర ఉన్నంతవరకు ఆయన గుర్తుంటారని, పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది అని ఆర్యవైశ్య సోదరులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దొడ్డా రామ్మోహన్ రావు, కపలవాయి సుబ్బారావు, మారేమళ్ళ సతీష్, వేములపల్లి వెంకటరత్నం, దివ్వెల కాశీ, కొప్పు నాగరాజు, దొడ్డా జయ నరసింహారావు, కొప్పు ప్రసాదు, పమిడిమర్రి పవన్, చందులూరు శ్రీకాంత్, దొడ్డా మహేష్ తదితర ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కుమారుడు దుర్మరణం





## తండ్రికి స్వల్ప గాయాలు

## మారని ట్యాంకర్ డ్రైవర్ల తీరు పట్టించుకోని అధికారులు

**జి.కొండూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని కట్టుబడిపాలెం గ్రామంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు దుర్మరణం చెందగా తండ్రి కి స్వల్ప గాయలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కథనం ప్రకారం నందిగామ పట్టణానికి చెందిన తమ్మి శెట్టి రవి 42 అతని తండ్రి నరసింహారావు లు కలసి మైలవరం మండలం గణప వరం గ్రామంలో సొంత పనుల నిమిత్తం బై క్ పై వచ్చారు.తిరిగి వారు సొంత ఊరు వెళుతుండగా కట్టుబడిపాలెం గ్రామంలో ఆయిల్ ట్యాంకర్ డీ కొనటంతో ఈ ప్రమాదంలో తమ్మిశెట్టి రవి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో తండ్రి నరసింహారావు స్వల్ప గాయాలు అయ్యాయి. కాగా కట్టుబడిపాలెం గ్రామంలో పలు ఆయిల్ సంస్థలకు చెందిన ట్యాంకర్ల డ్రైవర్లు నిర్లక్ష్యంగా తమ వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. కనీసం వీరికి మానవత్వం కూడా ఉండటం లేదని పలు వర్గాల ప్రజలు అగ్రహా న్ని వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతూ ఎంతోమంది అమాయక ప్రాణాలను డ్రైవర్లు బలిగొంటున్నారు. కనీసం పోలీసులు కూడా వీరిపై నామమాత్ర చర్యలే తీసుకుంటున్నారు. రహదారిపై పార్కింగ్ చేయటం, మరోవైపు ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఆయిల్ కంపెనీలు ఏర్పడి దాదాపు 30 ఏళు అవుతున్నాయి. ఆయిల్ సంస్థలకు సంబంధించిన పార్కింగ్ స్థలాలు ఉన్నప్పటికీ రహదారిపైనే తమ ట్యాంకర్లను నిలుపుదల చేసి ప్రమాదాలకు కారణం అవుతున్నారు. వీరిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్థానిక పోలీసులు స్పందించి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రమాదాలు జరగకుండా విద్యానగర్ నుండి కట్టుబడిపాలెం వరకు పోలీస్ పెట్రోలింగు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కట్టుబడి పాలెం లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జి కొండూరు ఎస్సై సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కులం పేరుతో దూషించారంటూ పత్రికా విలేకరిపై నమోదైన కేసు కొట్టివేత

### కృష్ణాజిల్లా ఎస్.సి., ఎస్.టి. కేసుల విచారణ కోర్టు న్యాయమూర్తి తీర్పు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చిలకలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2011లో మచిలీపట్నం చెందిన పి.టి. ఐ విలేఖరిపై అప్పటి కృష్ణాజిల్లా సమాచార పౌరసంబధాల అధికారి తనను కులం పేరుతో దూషించి విధులకు ఆటంకం కలిగించారంటూ పెట్టిన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ కృష్ణాజిల్లా ఎస్.సీ., ఎస్.టి. కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి ఎస్. చినబాబు సోమవారం తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2011లో, మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా సమాచార పౌరసంబధాల కార్యాలయంలో డి.పి.ఆర్.ఓ గా పనిచేస్తున్న కంచర్ల జయరావు 2011 మార్చి 10 వ తేదిన మధ్యాహ్నం 12 గంటల సమయంలో తమ కార్యాలయంలో జిల్లా విలేఖర్ల అక్రెడిటేషన్ కు సంభందించి ఫైల్స్ చూస్తున్న సమయంలో పి.టి.ఐ విలేఖరి దరఖాస్తు పలిశీలిస్తున్న సమయంలో పి.టి.ఐ విలేఖరి మన్నె సోమేశ్వరరావు తమ ఛాంబర్ లోనికి వచ్చి తనపై దౌర్జన్యం చేస్తూ అసభ్య పదజాలంతో దూషించి నీ అంతు చూస్తానంటూ బెదిరించి, షెడ్యూల్డు కులాలు చెందిన నన్ను కులం పేరుతో దూషించాడంటూ డి.పి.ఆర్.ఓ కంచర్ల జయరావు చిలకలపూడి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.డి.పి.ఆర్.ఓ కంచర్ల జయరావు ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడు సోమేశ్వరరావుపై అప్పటి మచిలీపట్నం డి.ఎస్.పి. వై.బాలశౌరి ఐపీసీ 353, 506, 290 సెక్షన్స్, సెక్షన్ 3(1) (ఎక్స్)ఎస్సీ & ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూషన్ తరపున 15 మంది సాక్షులను విచారణ చేశారు.కేసు విచారణ అనంతరం నిందితుని పై నేర నిరూపణకు తగిన సాక్ష్యాలు ప్రవేశ పెట్టడంలో ప్రాసిక్యూషన్ విఫలం కావడంతో కేసును కొట్టివేస్తూ,నిందితుడుని నిర్దోషిగా విడుదల చేస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడి తరపున న్యాయవాది ఆగస్య సత్యనారాయణ వాదించారు.

## దివ్యాంగ టీడీపీ కార్యకర్తపై దాడి



**పెడన మేజర్ న్యూస్ :** మైనార్టీ వర్గానికి చెందిన ఒక దివ్యంగా టీడీపీ కార్యకర్తపై పట్టణ వైసిపి నాయకులు దాడి చేసినవారిని ఉపేక్షించేది లేదని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సులేమాన్ దాదా అనే టీడీపీ కార్యకర్తను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కక్షపూరితంగానే టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారని దీన్ని ఉపేక్షించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షపడేలా చేస్తామని అన్నారు. రంజాన్ నెల ఆరోజు ఉపవాస దీక్ష విరమించుకుని బజారు సెంటర్లో ఒక టీ స్టాల్ వద్ద టీ తాగడానికి వెళ్లిన తమ కార్యకర్తపై విచక్షణా రహితంగా హత్యాయత్నం చేయటం పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఉందని అన్నారు. అధికారం లేకపోయినా అరాచకాలు శృతిమిస్తున్నాయని తెలిపారు. వికలాంగుడైన తమ పార్టీ కార్యకర్తపై సుమారు 25 మంది మూకుమ్మడిగా దాడి చేయడం పోలీసు ఉన్నత అధికారులతో సమగ్ర దర్యాప్తు చేసి వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యకర్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఇకపై ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యకర్తను పరామర్శించిన వారిలో కూటమి ప్రభుత్వ నాయకులు ఉన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**పెదపారుపూడి మార్చి 17 మేజర్ న్యూస్ :** పెద పారుపూడి మండలం వింజరంపాడు గ్రామంలో జరిగిన కొడవళ్ళ వెంకటేశ్వర రావు కుమారుని వివాహ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి), పలువురు నాయకులు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.

## ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని అందులో భాగంగానే పేద మహిళలను ఆదుకునేందుకు వారికి కుట్టు శిక్షణ ఇప్పించి ఉచితంగా కుట్టు మిషన్ ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా 18 నుండి 50 సంవత్సరాల లోపు వయసుగల మహిళలకు, ఒంటరి మహిళలకు ఆన్లైన్ ద్వారా ఉచితంగా అప్లికేషన్ ఈనెల 22వ తేదీ లోపు ఆన్లైన్లో పెట్టుకోవాలని తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, కార్పొరేషన్ 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ కోరారు.ఈ కుట్టు శిక్షణకు అప్లై చేసుకునేవారు ఆధార్ కార్డు, రైస్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, పట్టణాలలో ఒక లక్ష మూడు వేల రూపాయలు మించకుండా ఆదాయం ఉండాలని, గ్రామాలలో 81 వేల రూపాయలు మించకుండా ఆదాయం ఉండాలని ఇన్కమ్ సర్టిఫికెట్ కూడా కావాలని తెలిపారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు 45వ డివిజన్ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రెటరీ ఏ రామాంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లు ఇప్పించే విధంగా మహిళలతో ఆన్లైన్ లో అప్లికేషన్లు పెట్టించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 45వ డివిజన్ సచివాల అడ్మిన్, షేక్ అల్లా బక్షు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగానికి లోబడి పనిచేయాలి

### కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి లోబడి పని చేయాల్సి వుంటుందని, కళాశాలలు నిబంధనల మేరకు పని చేయాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ స్పష్టం చేశారు. సోమవారం విశ్వవిద్యాలయ అనుబంధ యూజి, పీజీ, బిఈడి కళాశాలల ప్రిన్సిపాల్ లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో అడ్మిషన్ల పెంపు కోసం ఆయా కళాశాలల్లో ఆన్లైన్ సెంటర్ ను ప్రారంభించి అవగాహన పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరం నుండి పలు మార్పులు తీసుకురబోతున్నట్లు పేర్కొన్నారు. విద్యా సంస్థలో భద్రతా చర్యలు, ముఖ్యంగా ఫైర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కళాశాలల్లో స్టూడెంట్ క్లబ్‌ల ఏర్పాటు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు పొందవచ్చన్నారు. రెక్టర్, సిడిసి డీన్ ఆచార్య ఎంవి బసవేస్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, పలు విభాగాధిపతిలు ఆచార్య మారుతి, ఆచార్య దీలిప్, సహ ఆచార్యులు డా. బ్రహ్మచారి, డా. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ప్రారంభమైన టెన్త్ పరీక్షలు



**పామర్రు మార్చి 17 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గంలో 10వ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గం పరిధిలోని పామర్రు, పమిడిముక్కల తోట్లవల్లూరు, పెదపారుపూడి మండలాల్లో అన్ని పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు విద్యార్థులు తొలి రోజున నూరు శాతం హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బంది పర్యవేక్షణ చేశారు. అలాగే ఉదయం విద్యార్థులను పరీక్షా కేంద్రాల ప్రధాన ద్వారం వద్ద సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరిహారాలు లేకుండా తనిఖీలు చేసి పరీక్ష హాల్లోనికి పంపారు. ఈ సందర్భంగా అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అత్యవసర మందులతో ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మార్చి 17 మేజర్ న్యూస్ :** కపిలేశ్వరపురం గ్రామంలోని శివరామ్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కంచర్ల వీర మల్లేశ్వరరావు కుమారుని వివాహ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, ఘంటా సురేష్, కొల్లిపర బాబి, లింగమనేని బాబురావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## గన్నవరంలో వెటర్నరీ విద్యార్థుల ఆందోళన




**గన్నవరం, మార్చి 17, మేజర్ న్యూస్ :** గన్నవరంలో 49 రోజులుగా ఎన్టీఆర్ పశువైద్య శాల విద్యార్థులు స్టైఫండ్ కోసం కళాశాల ప్రాంగణంలో క్లాసులు నిర్బంధించి నిరసన కార్యక్రమం చేస్తున్నారు. 49 రోజుల గడిచినా తమ డిమాండ్స్ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు కళాశాల నుంచి గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేసి, గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. రూ. 25 వేలు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# చిట్టిపాలెంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వేరువేరుగా తడి పొడి చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రతిరోజూ ఒక సమయాన్ని వీలుచేసుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి చెత్త సేకరణ పరిశీలించి ప్రజలకు స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు.ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ సోమవారం ఉదయం మచిలీపట్నం మండలం, అరిశేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చిట్టిపాలెం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించే విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో ఆయన దాదాపుగా 20 ఇళ్లకు పైగా సందర్శించి పచ్చరంగు చెత్తబుట్టలో తడి చెత్త, నీలిరంగు చెత్తబుట్టలో పొడి చెత్తను విభజించి ఇస్తున్నారా లేదా అని స్వయంగా పరిశీలించారు. చాలామంది ఇంటి యజమానులు వేరు చేసి సక్రమంగానే అందిస్తున్నప్పటికీ వారిలో కొంతమంది పొడి చెత్తలో తడి చెత్తను కూడా కలిపి ఇస్తుండటాన్ని ఆయన గమనించి, అట్టి చెత్తను వారి ముందే టార్పాలిన్ పై పోసి స్వయంగా వేరుచేసి చూపించారు. ఆ విధంగా ప్రతిసారి వేరు చేసి ఇవ్వాలని ఇంటి యజమానులకు సూచిస్తూ, దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మి కంపోస్ట్ ఎరువు తయారీని పరిశీలించి, తయారీకి అవలంబిస్తున్న పద్ధతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గ్రామ సచివాలయం ఆవరణలో మొక్కను నాటి అదే ఎరువును మొక్కకు ఉపయోగించారు.కలెక్టర్ తో పాటు ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సుకుమార్, ఈవోపిఆర్ అండ్ ఆర్ డి బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

## రావెళ్ల ట్రస్ట్ సహాయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లికి చెందిన పేద విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసం కోసం రావెళ్ల ట్రస్ట్ చైర్మన్ రావెళ్ల ఉదయ్కుమార్ రూ.10వేలు ఆర్థికసహాయం చేశారు. మేకావారిపాలెంలోని ఆర్ కె.కన్వెన్షన్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి నగదుపాయం అందించారు. విశాఖపట్నం కేజీహెచ్లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరికి చెరొక పదివేలు చొప్పున సాయమందించినట్లు ఉదయ్కుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ట్రస్ట్ అధ్యక్షుడు నిడమానూరి దిలీప్కుమార్, కృష్ణమోహన్, పరుచూరి సురేష్, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం





చల్లపల్లి మేజర్ న్యూస్ : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చల్లపల్లి మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. చల్లపల్లి విజయా కాన్వెంట్, చల్లపల్లి రాజా కళాశాలలో ఏ, బి సెంటర్లు, మాజేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, నాలుగు పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేట్(కంపా ర్ట్మెంట్)కు సంబంధించి మొత్తం 783 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 780 మంది పరీక్షలకు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు మాత్రమే గైర్హాజరయ్యారు. పురిటిగడ్డ జడ్పీ హైస్కూల్కు చెందిన విద్యార్థులు శ్రీకాకుళం పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాశారు. ఎమ్మీవో పి.వెంకటేశ్వరరావు పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాలకు బి.శ్రీరంగవల్లి, వేణుగోపాల్, శర్మ, రమణలు ఛీఫ్ సూపరెంటెండెంట్లుగా వ్యవహరించారు. గుడివాడ డీవైఈవో రవికుమార్ ఫ్లయింగ్ స్క్వాడ్గా తనిఖీలు చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాలకు రావటంతో పరీక్షా కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది.

## నా స్థలం ఆక్రమణ గురి కాకుండా రక్షణ కల్పించండి

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** తన సొంత స్థలాన్ని తన అన్న ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఘంటసాల మండలం శ్రీకాకుళం శివారు సూరపనేనిపాలెంకు చెందిన కుంపటి కోటేశ్వరరావు సోమవారం కలెక్టర్కు వినతిపత్రం అందించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ సూరపనేనిపాలెంలో తనకు 5 సెంట్లు స్థలం ఉందని ఆ స్థలాన్ని తన అన్న ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడంతో పాటు బయటకు గెంటేసేందుకు చూస్తున్నారని, పంచాయతీ కార్యదర్శికి, పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. మా అన్న తనపై దౌర్జన్యం చేసి స్థలం ఆక్రమించుకోవడానికి చూస్తున్నాడని తనకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్కు వినతిపత్నం ఇచ్చినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

## ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనిభారం తగ్గించేలా చర్యలు తీసుకోండి



**గుడివాడ, మేజర్ న్యూస్ :** ప్రభు త్వం దృష్టికి తీసు కెళ్లి గ్రామపంచాయతీ కార్య దర్శుల పనిభారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్య దర్శుల సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్ బాలజీని ఆయన ఛాంబర్లో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలు రకాల యాప్ లతో పాటు, పింఛన్ల పంపిణీ, అనేక ఇతర కార్యక్రమాలను నిర్వహించాల్సి రావడంతో పంచాయితీ కార్యదర్శులు తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శులు సంఘం ప్రచార కార్యదర్శి బి కోటయ్య, కార్యదర్శులు కె రామ్మోహన్ రావు, కె నరసింహారావు, మాధవేంద్ర రావు, ఓ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. వీరిని జిల్లాలోని అన్ని మండలం కార్యదర్శులు మద్దతుగా అనుసరించారు. కార్యదర్శులు సంఘం వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, విషయాన్ని ప్రభుత్వం ద్రుష్టికి తీసుకువెళ్తానన్నారు.

# కనీసం 30నిమిషాల వ్యాయామంతోనే ఆరోగ్యం




**గుడివాడ, మేజర్ న్యూస్ :** వ్యాయామం అనేది లావుగా ఉన్నారా సన్నగా ఉన్నారా నియమం లేదని ఎవరైనా చేయాల్సిన అవసరం ఉందని కనీసం 30 నిమిషాల నుండి గంట వరకు వయసును బట్టి తగిన వ్యాయామం చేయడం అవసరమని డాక్టర్ పల్లెం అకాష్ అన్నారు. సోమవారం స్థానిక అంజనేయ ఫంక్షన్హాల్లో బిహెచ్ఎంపిఏ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయ భాస్కరరాజు అధ్యక్షతన గుండె కవాటాల ప్రథమ చికిత్సపై పెద్దేశ్వర హెల్త్ కేర్ సెంటర్ సిఈవో పల్లెం ఆకాష్, ఆర్ఎంపి వైద్యులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలమాన పరిస్థితులు మనిషి జీవన గమనంలో వేగం వల్ల గుండె అలసటకు లోనవుతుందన్నారు. ఈ క్రమంలో తీసుకునే ఆహారం ఒక కారణం అయితే తగిన వ్యాయామం లేకపోవడం మరో కారణంగా పేర్కొన్నారు. నడక, సైక్లింగ్, వ్యాయామాలతో పాటు తక్కువ నూనెలతో కూడిన ఆహారం గుండె పదిలానికి ఆస్కారమన్నారు. బిహెచ్ఎంపిఏ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందూరి ఉమాశంకర్ మాట్లాడుతూ గుడివాడ ఏరియా సంఘం ఒక నిధిని ఏర్పాటు చేసి తద్వారా చనిపోయిన ఆర్ఎంపీకి అదే రోజు మట్టి ఖర్చుల కింద పదివేల రూపాయలు అందచేయాలనే తలంపు ఆర్ఎంపీల ముందు ఉంచగా అందుకు సభ్యులందరూ ఆమోదం తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన ఆర్ఎంపి వైద్యులకు చిరు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిహెచ్ఎంపిఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోలా సింహాచలం, మేదూరి రమేష్ బాబు, ఆర్ఎంపీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షులు నాగిపోగు కోటేశ్వరరావు, బిహెచ్ఎంపిఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుదే నాగచంద్రశేఖర్, ఏరియా అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులు వంగా ఎర్రన్నాయుడు, అగ్నిహోరీతరం ఫణి గోపాల్, సభ్యులు చీకుర్తి ప్రదీప్కుమార్, అబ్దుల్ మతీన్, లక్ష్మణరావు, జేవీ లక్ష్మీనారాయణ, కంబాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## కౌలు ముసాయిదా చట్టాన్ని ప్రవేశపెట్టాలి



**మొవ్వ (మార్చి 17) మేజర్ న్యూస్:** కౌలు రైతుల రక్షణ కోసం నూతన కౌలు కౌలు ముసాయిదా చట్టాన్ని ముసాయిదా చట్టాన్ని ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని సిపిఎం పార్టీ చేస్తూ డిమాండ్ చేస్తూ స్థానిక సచివాలయ అధికారులకు సోమవారం వినతి పత్రాలను అందించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని, మినుములు కింటా వక్కింటికి తొమ్మిది వేల రూపాయలు తగ్గకుండా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పెసలు ఇతర అపరాలను రాష్ట్ర ప్రభుత్వం బోనసిచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు తెలుగుదేశం పార్టీ సిఆర్సి చట్టాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నేతలు గుర్తు చేశారు రాష్ట్రంలో 70 నుండి 80 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారని కౌలు రైతుల రక్షణ కోసం గతంలో ఉన్న చట్టాలను గత ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేసిందని ఆరోపించారు. తద్వారా కౌలు రైతులు రుణాలు, పంట నష్టపరిహారం, పంటల బీమా, మద్దతు ధరలు పొందలేకపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యదర్శి శీలం నారాయణరావు సిపిఎం పార్టీ నేతలు మద్దుల బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిలో చీడపీడలపై అవగాహన



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిదిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు. మండల పరిధిలోని తాడేపల్లి గ్రామంలో చీడపీడలపై అవగాహన, కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. వేపాకు కషాయం,ఎలుకల యాజమాన్యం గురించి కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ డి. సుధారాణి అవగాహన కల్పించారు. బ్రమోడియోలిన్ విషప ఎర తయారి విధానాన్ని,పాటించవలసిన మెళుకువలను నైపుణ్య ప్రదర్శన ద్వారా రైతులకు తెలియజేశారు. చీడ పీడలు యాజమాన్యంలో వేపాకుల ప్రాముఖ్యతను వివరిస్తూ వేపాకులు కషాయం తయారీ విధానాన్ని వినియోగించే పద్ధతిని రైతులకు తెలియజేశారు. డాక్టర్ రేవతి, పరుచూరి.సుభాష్ చంద్ర బోస్, మైనేని. మధుసూదనరావు,అరవపల్లి శేష బపయ్య, ప్రసాద్రావు అప్పికట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పట్టణంలో అనధికార లే అవుట్లు పరిశీలన





**నందిగామ, మార్చి 17, మేజర్ న్యూస్:** పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాలలో అనుమతులు లేకుండా అనగా రెవెన్యూ శాఖ వారి నుండి భూమి మార్పిడి జరిగి యుండక, అలాగే నందిగామ పురపాలక సంఘం వారి నుండి ఎటువంటి ఆమోదం పొందక, అనధికారికంగా వెలసిన వివిధ లే-ఔట్లను పురపాలక సంఘ కమీషనర్ ఇ.వి.రమణబాబు క్షుణ్ణంగా పరిశీలించారు.తదుపరి అనధికార లే-ఔట్లు వేసిన రియల్టర్లు ఇటీవల ప్రభుత్వం వారు లే-ఔట్లకు సంబంధించిన నిబంధనలను సరళీకృతం చేసినందున, అట్టి సదవకాశం వినియోగించుకొని లే-అవుట్లకు సంబంధించి అన్ని రకాల అనుమతులు పొందిన తరువాతనే, వాటిని వినియోగదారులకు విక్రయించవలెనని, అట్లు కాక అనధికారికంగా వేసిన యెడల సంబంధిత లే-ఔట్లలోని రహదారులు, సరిహద్దురాళ్ళను తొలగించుటయే కాక చట్టప్రకారం తగు చర్యలు తీసుకొనబడునని తెలిపారు. అలాగే పట్టణ ప్రజలు సైతం అనధికార లే-ఔట్ల యందు తగు అప్రమత్తతతో మెలుగుచూ, చైతన్యవంతంగా వ్యవహరించ వలెనని, అందలి ప్లాట్లు కొనుగోలు చేసి అనధికార లే-ఔట్లను ప్రోత్సహించవద్దని, అట్టి ప్లాట్లకు భవిష్యత్తులో ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవనే విషయం పట్టణ ప్రజలంతా గ్రహించాలని కోరారు.కమీషనర్ తో పాటు పురపాలక సంఘ కార్యాలయ పట్టణ ప్రణాళికా విభాగపు పర్యవేక్షకులు ఎ.యస్.ప్రసాద్, రెవెన్యూ విభాగపు పర్యవేక్షకులు ఐ.యమ్.యస్.నిఖిత, వివిధ సచివాలయ ప్రణాళికా కార్యదర్శులు పాల్గొన్నారు.

# విజయవాడను ఉన్నతమైన నగరంగా తీర్చిదిద్దుతాం





**నియోజకవర్గంలో రూ.35 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు**

**3వ డివిజన్‌లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్**

**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర రాజధాని అమరావతి పరిధిలో ఉన్న విజయవాడ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దటమే కాకుండా ఉన్నతమైన నగరంగా తీర్చిదిద్దడానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. సుమారు రూ.35 కోట్ల వ్యయంతో ఒక్క తూర్పు నియోజకవర్గంలోనే వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ విజయలక్ష్మి కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెల్సుకున్నారు. ప్రజలు వివరించిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం విజయలక్ష్మి కాలనీలోని రూ. 35 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రెండు రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో త్వరితగిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఒక వైపున రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు, అవుట్ రింగ్ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. వీటితో పాటుగానే నగరంలోని రహదారులను కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం చేసుకుని పచ్చదనంతో కళకళలాడేటట్లు అందంగా ముస్తాబు చేస్తున్నామని చెప్పారు. నగరాన్ని సుందరమైన, ఉన్నతమైన నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విజయవాడ నగరంలో ఇప్పటి వరకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఒక్క తూర్పు నియోజకవర్గంలోనే రూ.35 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

**రూ.30 వేల కోట్లతో వేగంగా రాజధాని నిర్మాణ పనులు**

2014 సంవత్సరంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయినా వెంటనే అమరావతిని రాజధానిగా ప్రకటించారని, రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాలను ఇచ్చారన్నారు. 2014–19లో కేవలం రూ.1500 వందల కోట్లను కేంద్రం ఇచ్చిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరో పదివేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వ నిధులను జత చేసి రాజధానిలో అనేక పనులు చేపట్టారన్నారు. ఇప్పుటు కేంద్ర ప్రభుత్వంమే రూ.30 వేల కోట్లను రాజధాని నిర్మాణానికి కేటాయించిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రానికి గ్రహణం పట్టించదని, ఆ గ్రహాణాన్ని ప్రజలు ఓటు అనే ఆయుధంగా పారద్రొలారని అన్నారు. 164 సీట్లతో కూటమి ప్రభుత్వం నిరాటంకంగా కొనసాగుతుందన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమర్థతతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. అతి త్వరలోనే కేంద్రం కేటాయించిన రూ,30 వేల కోట్లతో అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, ఆ పనులు మొదలు అయితే విజయవాడ పరిసర ప్రాంతాల్లోని కార్మికులకు చేతినిండా పని ఉంటుందన్నారు. రియల్ ఎస్టేట్ కూడా పుంజుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి మంచి రోజులు త్వరలోనే రానున్నాయని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. తూమాటి ప్రేమనాథ్ మాట్లాడుతూ డివిజన్‌లోని విజయలక్ష్మి కాలనీలో నీటి, విద్యుత్ సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడ్డామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే డివిజన్‌లోని నీటి, విద్యుత్ సౌకర్యాలను పరిష్కరించడమే కాకుండా రహదారులను కూడా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నిర్మాణం చేసేలా చూశారని అన్నారు. డివిజన్‌లోని సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నందుకు కాలనీ వాసుల తరపున ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయులు గుత్తికొండ కృష్ణమోహన్, తాడి బాబూరావు, గద్దె రమేష్, జై శేఖర్, గుళ్ళపల్లి శంకర్, గోవిందరాజు, భాస్కర్, కార్పోరేషన్ ఈఈ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** సమాజంలో ప్రతి మహిళ చట్టాలపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలని ప్రొడక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్ (పోనిక్) ప్రతినిధి జాన్సన్ అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక సింగ్ నగర్‌లోని 59 వ డివిజన్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో సోమవారం మహిళలు, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య ముఖ్య అతిథిగా హాజరైన పోనిక్ ప్రతినిధి జాన్సన్ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు వృద్ధులకు ప్రత్యేకంగా చట్టాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ఒకసారి చట్టం ద్వారా బాలికలు చిన్నారులు మహిళలపై ఎటువంటి అఘాయిత్యాలకు ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించేందుకు ఫోక్సో చట్టం ఉందన్నారు. చట్టాలపై ప్రతి మహిళ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ ట్రాఫికింగ్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ సి.డాక్టర్ సూజన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.విజయ్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు...

## అన్న క్యాంటీన్లో ఎటువంటి మరమ్మతులు ఉండకూడదు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పరిధిలో గల అన్న క్యాంటీన్లన్నిటిలోనూ ఎటువంటి మరమ్మతులు ఉండరాదని అన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. సోమవారం మధ్యాహ్నం 18 వ డివిజన్ రాణిగారి తోట లో గల అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో ఎటువంటి మరమ్మతులు ఉండరాదని, అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఎటువంటి మరమతులు ఉన్న వెంటనే చేయించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అన్నారు.

## దేవస్థానాల జీర్ణోద్ధరణలకు లక్ష రూపాయల విరాళం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులో వేంచేసి ఉన్న శ్రీగంగానమ్మ తల్లి దేవస్థానం, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానముల జీర్ణోద్ధారణ కొరకు కీర్తిశేషులు చాపరాల అప్పారావు జ్ఞాపకార్థం వారి కుమారులు చాపరాల విజయ, సౌమ్య దంపతులు, చాపరాల కిరణ్, జ్యోతి దంపతులు లక్ష రూపాయల విరాళమును జీర్ణోద్ధరణ కమిటీ పెద్దలు ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, యలమంచిలి రామకోటేశ్వరరావులకు సోమవారం అందచేసారు. దాతల దాతృత్వానికి కమిటీ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.





## ఎన్టీఆర్ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ యొక్క ముగింపు వేడుక

**విజయవాడ, మార్చి 17, మేజర్ న్యూస్ :** యస్–జె ఆధ్వర్యంలో మ్యాజిక్ యూత్ నిర్వహించిన, ఎన్టీఆర్ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ సోమవారం ఆంధ్ర లయోలా కళాశాలలోని యస్–జె సెంటర్ ఫర్ ఎక్సలెన్స్లో అద్భుతమైన ముగింపు వేడుకతో ముగిసింది. ప్రధాన అతిథి నూతక్కి ప్రియాంక, వుమన్ గ్రాండ్మాస్టర్, ప్రపంచ ఆసియా చెస్ ఛాంపియన్ (2012), యువ ఆటగాళ్ళు తమ నైపుణ్యాలను పదును పెట్టడానికి మరిన్ని ఆటలు ఆడటంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆంధ్ర లయోలా సంస్థల రెక్టర్ ఫాదర్ పి. ఆర్. జాన్, టోర్నమెంట్ అంతటా తమ పిల్లలకు మద్దతు ఇచ్చిన తల్లిదండ్రుల అంకిత భావాన్ని ప్రశంసించారు. యస్–జె వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఫాదర్ బాల బొల్లినేని యస్ జె, వ్యూహాత్మక ఆలోచనను పెంపొందించడానికి మరిన్ని టోర్నమెంట్లలో పాల్గొనమని విద్యార్థులను ప్రోత్సహించారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎం.రాజీవ్, యువ ప్రతిభను పెంపొందించడంలో టోర్నమెంట్ పాత్రను నొక్కి చెబుతూ, పాల్గొన్నవారికి, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టోర్నమెంట్ విజయవాడ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది, ఎం. మణి రాజు, పి. నదియా, వి.లోకేశ్, ఎ. ప్రేమ్ కుమార్, సి. హర్షిత,, ఎ. అఖిల లతో కూడిన నిర్వాహక సమితి యొక్క కృషితో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ ఓపెన్–కేటగిరీ టోర్నమెంట్లో అన్ని వయసుల వారి నుండి బలమైన పోటీ నెలకొంది, విజేతలకు రూ.20,000ల నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేయబడ్డాయి.

## చీమలపాడు బాబా వారి ఆశీస్సులతో ఇఫ్తార్ విందు



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** హజ్రత్ ఇమామ్ హసన్ ముజ్తబా ఎ ఎస్ వారి జన్మదినోత్సవాన్ని, పురస్కరించుకొని ఇఫ్తార్ లంగర్ షరీఫ్ మహా అన్న సంతర్పణ ఘనంగా నిర్వహించారు. ఈ మహా దివ్య కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక చక్రవర్తి స్ఫూర్తిప్రదాత గురు దేవులుపీర్ ఓ ముర్షిద్ హుజూర్ హజరత్ సూఫీ ఖ్వాజా ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బోగ్దాదీ బాబా చీమలపాడు వారి సంపూర్ణ ఆశీస్సులతో ఆస్థాన అతా ఏ బాగ్ ఏ సర్కార్ తాజుల్ ఔలియా దర్బార్ జంపని లో సజ్జాదా అల్ ఖాద్రియ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరీ సోహార్వర్ది అతా నిజాం బాబా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దర్బార్ లో ఉపవాస దీక్ష పరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం నిజాం బాబా మాట్లాడుతూ సహనం, జ్ఞానం, ధర్మానికి వెలుగునిచ్చే గొప్ప జీవితంగా నిలిచిన అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహివ సల్లం వారి మనవడు ఇమామ్ ఏ హాసన్ అలైహిస్సలామ్ వారికి నివాళులు అర్పిస్తూ వారి అసమానమైన భక్తి, దాతృత్వం, శాంతి పట్ల నిబద్ధతను, దైవిక జ్ఞానం యొక్క సారాంశంగా, ప్రవచనాత్మక వారసత్వ వారసుడిగా ఇమామ్ హాసన్ వారి గూర్చి వివరించారు. కరుణ, క్షమ, జ్ఞానంతో కూడిన ఇమామ్ హాసన్ వారి జీవిత విధానాన్ని అనుసరించాలని కోరారు. శాంతి, ఐక్యత, అబద్ధానికి వ్యతిరేకంగా ప్రతిఘటన, సహనం, అందరి పట్ల ఆయన దాతృత్వం మానవాళికి పాఠాలుగా పనిచేస్తాయన్నారు. ఉపవాస దీక్షను ఆచరించే వారికి పదిహేనవ రోజు పోషకమైన ఇఫ్తార్ విందు, కుల, మత, జాతి, వర్గ భేదం లేకుండా అందరికి లంగర్ షరీఫ్ – మహా దివ్య అన్న సంతర్పణ ఘనంగా నిర్వహిస్తున్నామని రంజాన్ మాసం 30 రోజులు ఉపవాస దీక్ష లో ఉన్నవారితో పాటు కుల మత భేదం లేకుండా అందరికి అన్న సమారాధన దైవ కృపతో చీమలపాడు బాబా వారి ఆశీస్సులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999